సాక్షి
యాదాద్రి భువనగిరి

ఆదివారం । 19 । నవంబర్ । 2023



ఉద్యమ ఆకాంక్ష నెరవేరలేదు
ఉద్యమ ఆకాంక్షలు నెరవేరక రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు నిరాశలో ఉన్నారని హరగోపాల్ అన్నారు.
- 10లో



ధన్సింగ్‌తండాలో మృత్యుఘోష
నల్లగొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) మండలం ధన్సింగ్‌తండాలో గంటల వ్యవధిలో ముగ్గురు మృతిచెందారు.
- 10లో



అధికార దుర్వినియోగం..
ముఖ్యమంత్రి కేసీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని మోత్కుపల్లి నర్సింహులు ఆరోపించారు.
-10లో

న్యూస్‌రీల్

26న భువనగిరికి సీతారాం ఏచూరి రాక

భువనగిరిటౌన్ : సీపీఎం అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ జిల్లా కేంద్రంలో ఈనెల 26న నిర్వహించనున్న రోడ్ షోలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొంటారని జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ వెల్లడించారు. రోడ్ షో 27న ఉండగా 26కు మార్పు చేశామన్నారు. శనివారం భువనగిరిలో జరిగిన జిల్లా కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి నియోజవర్గంలో కొండమడుగు నరసింహ, మునుగోడులో దోనూరి నర్సిరెడ్డి, నకిరేకల్‌లో బొజ్జ చిన్న వెంకులు పార్టీ తరఫున పోటీ చేస్తున్నారని పేర్కొన్నారు. రోడ్‌షోకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరు మల్లేశం పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న ఎన్నికల పరిశీలకుడు రాకేష్‌కుమార్

బీబీనగర్ : మండలంలోని జైనంపల్లి, కొండమడుగు, మహాదేవ్‌పురం, పడమటిసోమారం, వెంకిర్యాలలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాకేష్‌కుమార్ సందర్శించారు.. పోలింగ్ కేంద్రాల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించాలని సూచించారు. అదే విధంగా పోలీసు పరిశీలకుడు విపుల్‌కుమార్ బీబీనగర్‌లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. భద్రతా చర్యలపై పోలీసులకు సూచనలు చేశారు. వారి వెంట తహసీల్దార్ శ్రీధర్, సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ యుగేందర్ ఉన్నారు.

ఓటు వేసి.. సెల్ఫీ దిగు



యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ బోర్డు

యాదగిరిగుట్ట : అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచాలన్న లక్ష్యంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు అధికారులు వివిధ రకాల చర్యలు చేపడుతున్నారు. పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక వసతులు కల్పించడంతో పాటు ఓటర్లు ఓటు వేసిన తర్వాత ఫొటో దిగడానికి సెల్ఫీ పాయింట్ బోర్డులు ఏర్పాటు చేశారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీ కార్యాలయంలోని రెండు పోలింగ్ స్టేషన్లలో సెల్ఫీ పాయింట్‌లు సిద్ధం చేశారు.

నారసింహుడికి నిత్యారాధనలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున శ్రీస్వామి, అమ్మవారికి సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం ఆరాధన, నిజాభిషేకం చేసి తులసీ దళాలతో అర్చించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం గవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాఢ వీధిలో ఊరేగించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచన పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

అభ్యర్థులకు గన్‌మెన్ల కేటాయింపు

భువనగిరిటౌన్ : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు పోలీసు శాఖ గన్‌మెన్లను కేటాయించింది. పైళ్ల శేఖర్‌రెడ్డికి ఇప్పటికే టు ప్లస్ టు భద్రత ఉండగా ప్రస్తుతం మరకొరిని కేటాయించింది. అనిల్‌కుమార్‌రెడ్డి, గూడూరు నారాయణరెడ్డి, పడాల శ్రీనివాస్‌కు ఒక్కొక్కరి చొప్పున కేటాయించారు. వీరంతా శనివారం విధుల్లో చేరారు. ఇదిలా ఉండగా గన్‌మెన్ కేటాయిస్తామని సీపీఎం అభ్యర్థి కొండమడుగు నర్సింహకు అధికారులు సమాచారం ఇవ్వగా ఆయన నిరాకరించారు.

బీఆర్‌ఎస్‌ను ఓడించాలి

- నల్లగొండకు ద్రోహం చేసిన కేసీఆర్
- డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే అభివృద్ధి



నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన సకలజనుల విజయ సంకల్ప సభకు హాజరైన జనం



అభివాదం చేస్తున్న అమిత్‌షా

- బ్రాహ్మణవెల్లెంల, శివన్నగూడెం ప్రాజెక్టులను విస్మరించారు
- నల్లగొండ అభివృద్ధికి కేంద్రం రూ.400 కోట్లు ఇచ్చింది
- బీఆర్‌ఎస్ అంటేనే అవినీతి, లంచగొండి పార్టీ
- సకలజనుల విజయ సంకల్ప సభలో కేంద్రహోం శాఖ మంత్రి అమిత్‌షా



అమిత్‌షాకు నమస్కరిస్తున్న బీజేపీ అభ్యర్థులు మాదగాని శ్రీనివాస్‌గౌడ్, నివేదితారెడ్డి, కృష్ణారెడ్డి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ జిల్లా అభివృద్ధిపై కేసీఆర్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, అభివృద్ధిని విస్మరించిన బీఆర్‌ఎస్ పార్టీని ఓడించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కోరారు. ఎస్‌ఎల్‌బీసీ, బ్రాహ్మణ వెల్లెంల, శివన్నగూడెం ప్రాజెక్టులు పూర్తి చేయకుండా నల్లగొండ ప్రజలకు సీఎం కేసీఆర్ ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ అంటేనే అవినీతి, లంచగొండి పార్టీ అని ఘాటుగా విమర్శలు చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన సకల జనుల విజయ సంకల్ప సభలో అమిత్‌షా మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో కేసీఆర్ విఫలమయ్యారని విమర్శించారు. నల్లగొండ పట్టణ అభివృద్ధికి కేంద్రం రూ.400 కోట్లు ఇచ్చిందన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం ఇచ్చిన నిధుల్లో కూడా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. దళిత బంధు ఎంత మందికి ఇచ్చారని ప్రశ్నించారు. ఇచ్చిన చోట బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు కమీషన్లు తీసుకున్నారని దుయ్యబట్టారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయలో రూ.కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. జిల్లాలో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తారా అని అమిత్ షా ప్రశ్నించగా గెలిపిస్తామని ప్రజలు చేతులెత్తి నినదించారు.

నల్లగొండ గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తాం

బీజేపీ నల్లగొండ అభ్యర్థి మాదగాని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. నల్లగొండ నుంచి స్థానికేతరులను తరిమితేనే నల్లగొండ అభివృద్ధి సాధ్యమని, గత నాలుగు దశాబ్దాలుగా పక్క నియోజకవర్గానికి చెందిన కాంట్రాక్టర్లు వచ్చి ఇక్కడ ఎమ్మెల్యే అయి నల్లగొండ అభివృద్ధిని విస్మరించారని తెలిపారు. నల్లగొండలో భూపాల్‌రెడ్డి హయాంలో భూ కబ్జాలు, సెటిల్‌మెంట్లు పెరిగిపోయాయన్నారు. నాగార్జునసాగర్ అభ్యర్థి కంకణాల నివేదితరెడ్డి మాట్లాడుతూ.. బీజేపీతోనే అభివృద్ధి సంక్షేమం సాధ్యమని, బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అవినీతి, అక్రమాలకు పాల్పడే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు గుణపాఠం చెప్పాలని కోరారు.

బీజేపీకి పట్టం కట్టాలి

మునుగోడు నియోజకవర్గ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను ఓడించి బీజేపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. జిల్లాలో బీజేపీ అభ్యర్థుల గెలుపుతోనే జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమని నకిరేకల్ నియోజకవర్గ అభ్యర్థి మొగులయ్య అన్నారు. అన్ని పార్టీలకు అవకాశమిచ్చిన జిల్లా అభివృద్ధికి నోచుకోలేదని బీజేపీ అభ్యర్థులకు ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని దేవరకొండ అభ్యర్థి లాలునాయక్ అన్నారు. అవినీతి అక్రమాలకు తావు లేకుండా అవినీతి రహిత పాలన కేవలం బీజేపీతోనే సాధ్యమని పార్టీ మిర్యాలగూడ అభ్యర్థి సాధినేని శ్రీనివాసరావు అన్నారు. కాగా, అమిత్ షా ప్రసంగాన్ని బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ తెలుగులో అనువదించారు. ఈ సభలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, సీనియర్ నేతలు చింత సాంబమూర్తి, గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూకల నరసింహారెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, కన్మంతరెడ్డి శ్రీదేవి, బండారు ప్రసాద్, నాయకులు ప్రదీప్‌కుమార్, పోతెపాక సాంబయ్య, బాబా, పెరిక మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహం

నల్లగొండ టౌన్: నల్లగొండలో శనివారం జరిగిన బీజేపీ సకల జనుల విజయ సంకల్ప సభ విజయవంతమైంది. ఆశించిన స్థాయిలో సభకు జనం తరలి రావడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. నల్లగొండ, మునుగోడు, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, నకిరేకల్, దేవరకొండ నియోజకవర్గాల నుంచి జన సమీకరణ చేశారు. కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా మధ్యాహ్నం 2.22 నిమిషాలకు వేదికపైకి చేరుకోగానే కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కేరింతలు కొట్టారు. అమిత్‌షా తన 19 నిమిషాల ప్రసంగంలో నరేంద్రమోదీ చేసిన అభివృద్ధిని ప్రస్తావిస్తూ రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలు కుంభకోణాలపై వివరించారు. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. అమిత్ షా ప్రసగింస్తున్నంత సేపు కార్యకర్తలు ఉత్సాహంగా ఆయన ప్రసంగాన్ని వింటూ ఈలలు వేసి అభివాదం చేశారు.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

- కేంద్ర ఎన్నికల పరిశీలకుడు మహేశ్వరన్

సాక్షి, యాదాద్రి : ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు సీఎస్ మహేశ్వరన్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం మైక్రో అబ్జర్వర్లకు ఓటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వేచ్ఛగా, సజావుగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడంతో మైక్రో అబ్జర్వర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాల్లో ప్రతి అంశాన్ని పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేయాలన్నారు. కలెక్టర్ హనుమంతు కె.జెండగే మాట్లాడుతూ భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో 197మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు వెల్లడించారు. శిక్షణ ముగిసిన అనంతరం మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ చేయనున్నట్లు తెలిపారు. మైక్రో అబ్జర్వర్ల పాత్ర ప్రతి దశలో నిర్ణయాత్మకంగా ఉంటుందన్నారు. పోలింగ్ ప్రారంభం అయినప్పటి నుంచి ఈవీఎంలను తరలించేవరకు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మైక్రో అబ్జర్వర్ల విధులు, బాధ్యతలపై అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టరు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర ఎన్నికల పరిశీలకుడు మహేశ్వరన్, చిత్రంలో కలెక్టర్

హోం ఓటింగ్‌కు ఏర్పాట్లు చేయండి

సినియర్ సిటిజన్లు, దివ్యాంగులు ఇంటి నుంచి ఓటు వేసేందుకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, పోలీసు అధి కారులతో సమావేశమై హోం ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో హోం ఓటింగ్ ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుదన్నారు. 21న ఇంటికి వెళ్లినప్పుడు ఓటరు లేకపోతే 23 తేదీన మళ్లీ వెళ్లి చివరి అవకాశమని ఓటరుకు తెలియజేయాలన్నారు. రెండవ సారి కూడా లేకపోతే అతను ఓటు వేసే అవకాశం కోల్పోతాడని వివరించారు.ఇంటివద్ద కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసి గోప్యత పాటించాలని సూచించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

- డీసీపీ రాజేశ్‌చంద్ర

బొమ్మలరామారం : ఎన్నికలను స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీసీపీ రాజేశ్ చంద్ర తెలిపారు. బొమ్మలరామారం, మల్యాల, హాజీపూర్, చౌదర్‌పల్లి, పిల్లిగుండ్లతండా, తిమ్మాపూర్‌తో పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన సందర్శించారు. ఆయా కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేయాలని కోరారు.

విద్యార్థులతో ముచ్చటించిన డీసీపీ

డీసీసీ రాజేశ్‌చంద్ర హాజీపూర్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. వారితో పాఠాలు చదివించారు. ఉత్తమపౌరులుగా ఎదగాలని సూచించారు. ఆయన వెంట ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీపీ

ఉద్యోగుల హక్కుల పరిరక్షణే ధ్యేయం



జగదీశ్వర్‌ను సన్మానిస్తున్న మందడి ఉపేందర్‌రెడ్డి, భగత్, ఖదీర్, టీఎన్‌జీఓ నాయకులు

- టీఎన్‌జీఓ రాష్ట్ర కార్యదర్శి జగదీశ్వర్

సాక్షి, యాదాద్రి : ఉద్యోగుల హక్కుల పరిరక్షణే తమ సంఘం ధ్యేయమని, అందుకోసం రాజీలేని విధానం అవలంభిస్తామని టీఎన్‌జీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ అన్నారు. శనివారం ఆయన భువనగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా మహిళలకు గ్రామీణ ప్రాంతాల్లో కాకుండా పట్టణాల్లో డ్యూటీ వేయాలని కోరారు. ఉద్యోగులు ఏ పార్టీ మద్దతుగా ప్రచారం చేయవద్దని సూచించారు. ఉద్యోగులకు సంబంధించిన పాత ఫొటోలు, వీడియోలను కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. ఇటువంటి ఫిర్యాదులు వస్తే కలెక్టర్ విచారణ చేసిన తర్వాతే చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని సంఘం ఆధ్వర్యంలో వారిని చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ఉద్యోగులకు ఇచ్చే డీఏ తమ డిమాండ్ కాదని, హక్కుగా పేర్కొన్నారు. అనంతరం జగదీశ్వర్‌ను ఉద్యోగ సంఘాల నేతలు సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నేత శ్రీనివాస్, నర్సింహారెడ్డి, ఉద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మందడి ఉపేందర్ రెడ్డి, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు భగత్, కార్యదర్శి ఖదీర్, కోశాధికారి శ్రీకాంత్, కలెక్టరేట్ ఏఓ జగన్, యూనియన్ నాయకులు శైలజ, ఆసిఫ్, ఆనంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే



ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కర్నాటక ఎమ్మెల్యే, నాయకులు

- ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం
- కాంగ్రెస్ అభ్యర్థి అనిల్‌కుమార్ రెడ్డి, కర్నాటక ఎమ్మెల్యే రిజ్వాన్



సమ్మేళనంలో పాల్గొన్న ముస్లిం మహిళలు

భువనగిరిటౌన్ : రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందని, ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కర్నాటక ఎమ్మెల్యే రిజ్వాన్ పేర్కొన్నారు. శనివారం భువనగిరిలోని వైఎస్సార్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ సర్కార్ ముస్లింలకు ఇచ్చిన ఏఒక్క హామీ అమలు చేయలేదన్నారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశారని విమర్శించారు. పేదలకు సంక్షేమ పథకాలు అందజేయడంలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ పడిపోవడం మొదలైందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభావం తగ్గుతుందన్నారు. భువనగిరి ఖిలాపైనా కాంగ్రెస్ జెండా ఎగురవేసి చరిత్ర లిఖించబోతున్నామని చెప్పారు. కాంగ్రెస్ గెలుపునకు పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని, ఆరు గ్యారంటీ స్కీంలను గడపగడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు ఎండీ జలీల్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఉజ్మషాకేరా, సలీం, కుంభం కీర్తిరెడ్డి, శ్రీరాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు రఫీయొద్దీన్, మజహర్, సలావుద్దీన్, అవైస్‌చిస్తీ, షరీఫ్,అబేద్‌లీ, రాషేద్‌హుస్సెన్, బాబా, అమనత్‌వుల్లా, లాయిఖ్‌అహ్మద్, పాయాజ్, కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గెలిపిస్తే బీసీ ముఖ్యమంత్రి

- బీజేపీ స్టార్ క్యాంపెయినర్ ఈటల రాజేందర్
- గూడూరు నారాయణరెడ్డికి మద్దతుగా వలిగొండలో రోడ్ షో

వలిగొండ : బీసీలంతా ఏకం అవుతున్నారని, వారి ఐక్యతను చూసి కేసీఆర్‌కు వణుకు పుడుతోందని బీజేపీ స్టార్ క్యాంపెయినర్ ఈటల రాజేందర్ అన్నారు. కేసీఆర్ ఆగమాగం అవుతున్నాడని, మామ, అల్లుని పీఠాలు కదులుతున్నాయన్నారు. బీజేపీని గెలిపిస్తే బీసీలే ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. శనివారం వలిగొండ మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోలో భువనగిరి బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డితో కలిసి ప్రసగించారు. 75 ఏళ్ల రాష్ట్ర పరిపాలనలో ఇప్పటి వరకు బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి కాలేదన్నారు. మాదిగల వర్గీకరణకు ప్రధాని మోదీ.. మంద కృష్ణకు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండానే మళ్లీ అధికా రంలోకి వచ్చేందుకు పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చలేదని, నిధులు, నియామకాలు కేసీఆర్ కుటుంబానికి మాత్రమే దక్కాయన్నారు. రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం దుకాణాలకు అనుమతి ఇచ్చిందని, బెల్ట్ దుకాణా లు ఏర్పాటు చేయిస్తూ ప్రజలను మత్తులో ముంచుతుందని ధ్వజమెత్తారు. కేజీటూ పీజీ వరకు ఇంగ్లిష్ మీడియం విద్యను అందించడం, రూ10.లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించడం బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీ అని, సచ్చేది బీఆర్‌ఎస్ అని పేర్కొన్నారు. కేసీఆర్‌ను డిసెంబర్ 3న తర్వాత శాశ్వతంగా ఫాంహౌజ్‌కు పరిమితం చేయాలని పిలుపునిచ్చారు. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పునకు కృషి చేస్తామని, భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



రోడ్ షోలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్, చిత్రంలో అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి

వలిగొండను హెచ్‌ఎండీఏ పరిధిలోకి తెస్తా : గూడూరు నారాయణరెడ్డి

తనను గెలిపిస్తే వలిగొండ మండలాన్ని హెచ్‌ఎండీఏ పరిధిలోకి తీసుకువస్తానని బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి అన్నారు. ఈ ప్రాంత విద్యార్థులకోసం సొంత నిధులో డిగ్రీ కళాశాల, ప్రయాణికుల సౌకర్యార్థం రెండు బస్సులు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో ఐటీ కారిడార్ ఏర్పాటుకు కృషి చేస్తానని, రెండు నెలల్లో మూసీ ప్రక్షాళన చేసి చూపిస్తానన్నారు. రోడ్ షోలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి సోము వీర్రాజు, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్ రావు, నాయకులు సీఎన్ రెడ్డి, దాసరి మల్లేశం, పొత్తంశెట్టి రవీందర్, పాశం భాస్కర్, ఏలే చంద్రశేఖర్, చందా మహేందర్, బంధారపు లింగస్వామి, దంతూరి సత్తయ్య, పనుమటి జగన్‌మోహన్‌రెడ్డి, నాగెల్లి సుధాకర్, శ్రీనివాస్, డోగిపర్తి సంతోష్, మారోజు అనిల్‌కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.



రోడ్ షోలో పాల్గొన్న బీజేపీ కార్యకర్తలు, ప్రజలు

● విజయ సంకల్పం



నల్లగొండలో నిర్వహించిన సకల జనుల విజయ సంకల్ప సభలో మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, అభివాదం చేస్తున్న అభ్యర్థులు, నాయకులు



నల్లగొండలోని డీటీసీలో హెలికాప్టర్ దిగి వస్తున్న అమిత్‌షా, చిత్రంలో ఎంపీ కె.లక్ష్మణ్

● కమలం గూటికి..



సూర్యాపేట మున్సిపాలిటీ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణకు కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

జాతీయ, ప్రాంతీయ పార్టీలంటే..

భువనగిరి : జాతీయ, ప్రాంతీయ పార్టీలంటూ చదవడంతో పాటు వింటుంటాం. సార్వత్రిక ఎన్నికల్లో ఏదైనా రాజకీయ పార్టీకి నాలుగు రాష్ట్రాల్లో పోలైన ఓట్లలో నాలుగు శాతం ఓట్లు వస్తే జాతీయ పార్టీగా ఎన్నికల సంఘం గుర్తిస్తుంది. ఒక ప్రాంతంలో నాలుగు శాతం ఓట్లు వస్తే ప్రాంతీయ పార్టీగా గుర్తిస్తారు. జాతీయ, ప్రాంతీయ పార్టీల ఎన్నికల గుర్తులను కేంద్ర ఎన్నికల సంఘం కేటాయిస్తుంది.

బీఆర్ఎస్ పాలనలో అధికార దుర్వినియోగం

● మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు



మాట్లాడుతున్న మాజీ మంత్రి మోత్కుపల్లి

యాదగిరిగుట్ట: బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఆయనను గద్దె దించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధమయ్యారని జోస్యం చెప్పారు. యాదగిరిగుట్టలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆలేరు అభ్యర్థి బీర్ల ఐలయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. తూతూ మంత్రంగా దళితబంధు ఇచ్చారని విమర్శించారు. ఆలేరు నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీర్ల ఐలయ్యను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, ఎంపీపీ చీర శ్రీశైలం, కౌన్సిలర్ ముక్కెర్ల మల్లేష్‌యాదవ్, నాయకులు కానుగు బాలరాజు, ఇంజ నరేష్, గుండ్లపల్లి భరత్, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ రేగు బాల్‌నర్సయ్య తదితరులున్నారు.

'కాకి' సోదరుల మద్దతు ఎవరికి..?

జంగ్ తెలంగాణ

ఆత్మకూర్ (ఎస్) (సూర్యాపేట) : ఆత్మకూర్ (ఎస్) మండలంలో కాకి సోదరులకు రాజకీయ చరిత్ర ఉంది. ఇక్కడ ఏ పార్టీ అభ్యర్థి అయినా.. కాకి దయాకర్ రెడ్డి, కృపాకర్‌రెడ్డి మద్దతు కోరుతారు. తెలంగాణ ఉద్యమంలో కాకి సోదరులు ఆత్మకూర్ (ఎస్) మండలంలో ఉద్యమాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అనంతరం జరిగిన 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి గెలుపులో భాగస్వాములు అయ్యారు. అయితే అనారోగ్యంతో మూడు సంవత్సరాల క్రితం కాకి దయాకర్ రెడ్డి మృతి చెందారు. కాకి కృపాకర్‌రెడ్డి 2020 వరకు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా కొనసాగారు. తర్వాత రాజకీయంగా దూరంగా ఉంటున్నారు. వారం రోజుల క్రితం దయాకర్‌రెడ్డి తనయుడు జార్జిరెడ్డి విదేశాల నుంచి ఆత్మకూర్ వచ్చి తమ అనుచరులతో రాజకీయ భవిష్యత్‌పై సమావేశం నిర్వహించారు. కాగా ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో సూర్యాపేట నియోజకవర్గంలో పోటీ పడుతున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు కాకి సోదరుల మద్దతు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

● విద్యార్థుల మాక్ పోలింగ్..



కోదాడలోని గ్లోబల్ పాఠశాలలో నిర్వహించిన మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఎన్నికల చిత్రాలు

● భువనగిరి ప్రజలకు కాపరినవుతా..



భువనగిరి మండలం అనాజిపురంలో కార్యకర్తలు అందజేసిన గొర్రె పిల్లతో కాంగ్రెస్ అభ్యర్థి అనిల్ కుమార్‌రెడ్డి

● గూడూరు.. సినీ గ్లామరు



వలిగొండ వద్ద రోడ్‌షోలో బీజేపీ భువనగిరి అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి, రజాకార్ సినిమా నటులు

భిక్షాటన చేస్తూ వినూత్న ప్రచారం



భిక్షాటన చేస్తూ ప్రచారం చేస్తున్న తెలంగాణ బతుకమ్మ పార్టీ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి

ఆలేరురూరల్: తెలంగాణ బతుకమ్మ పార్టీ ఆలేరు నియోజకవర్గ అభ్యర్థి కందాడి మహిపాల్‌రెడ్డి శనివారం ఆలేరు పట్టణ కేంద్రంలో భిక్షాటన చేస్తూ వినూత్నంగా ప్రచారం నిర్వహించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగుల జీవితాలు అంధకారంలోకి వెళ్లిపోయాయని అన్నారు. మైకు గుర్తుకు ఓటు వేసి తనను అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఆయిల్ ట్యాంకర్ బోల్తా

బీబీనగర్: హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ శనివారం బీబీనగర్ మండల కేంద్రంలో వరంగల్-హైదరాబాద్ హైవేపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ట్యాంకర్ రోడ్డుకు అడ్డంగా పడడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వాహనాలను సర్వీస్ రోడ్డు గుండా మళ్లించారు. అనంతరం భారీ క్రేన్ సహాయంతో లారీని రోడ్డు పక్కకు తరలించారు. రోడ్డుపై పడిన ఆయిల్‌ను శుభ్రం చేయించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష నెరవేరలేదు

● ప్రొఫెసర్ హరగోపాల్

నల్లగొండ రూరల్: తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష నెరవేరలేదని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. శనివారం నల్లగొండలోని టీజేఎస్ కార్యాలయంలో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ) ఆధ్వర్యంలో ఆ కమిటీ జిల్లా కన్వీనర్ దర్శనం నర్సింహ అధ్యక్షతన 'పదేళ్ల తెలంగాణ-ప్రజల ఆకాంక్షలు-కర్తవ్యాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు హరగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏ ఆకాంక్షలతో తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యం అయ్యారో నేడు అవి నెరవేరక రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు నిరాశలో ఉన్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో సకల జనులు తమ ఓటును ఐదేళ్ల భవిష్యత్ కోసం సరైన ఆలోచన చేసి సరైన వ్యక్తులకు వేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ఆకాంక్షలకు విరుద్ధంగా పాలిస్తున్నాయన్నారు. మంచి పాలన కోసం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే నాయకులను ఎన్నుకోవాలన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

పాలించే నాయకున్ని ఎన్నుకున్న తర్వాత ప్రజల కొనుగోలు శక్తి పెరగకపోగా ఎన్నుకున్న నాయకుల సంపాదన పెరుగుతుందన్నారు. ప్రజల తరఫున పోరాటం చేసేందుకు తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ సిద్ధంగా ఉందన్నారు. అనంతరం అతిథులు కన్నెగంటి రవి, గురువారెడ్డి, రవిచందర్ మాట్లాడుతూ.. నిరుద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారని, వారి వయసు మీరినా ఉద్యోగాలు, ఉపాధి కల్పన లేకపోవడంతో అడ్డా మీద కూలీలుగా జీవనం సాగించడం బాధాకరమన్నారు.

ధన్సింగ్ తండాలో మృత్యుఘోష !

● గంటల వ్యవధిలో ముగ్గురి మృతి
● పురుగుల మందు తాగిన ఇద్దరు.. అనారోగ్యంతో మరొకరు..
● తిరుమలగిరి (సాగర్) మండలంలో విషాదం



బాలు నాయక్ మృతదేహం



పద్మ మృతదేహం



మారుతికుమార్ (ఫైల్)

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : నల్లగొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) మండలం ధన్సింగ్ తండాలో మృత్యుఘోష తాండవించింది. ఒకే రోజు పురుగుల మందు తాగిన ఇద్దరు, అనారోగ్యంతో బాధపడుతున్న మరొకరు గంటల వ్యవధిలోనే మృతిచెందారు. తిరుమలగిరి(సాగర్) మండలం ధన్సింగ్ తండాలో ఒకే సామాజికవర్గానికి చెందిన 120 కుటుంబాలు నివసిస్తున్నాయి. 350మంది ఓటర్లు ఉన్నారు. వీరికి వ్యవసాయమే జీవనాధారం. తండాకు చెందిన నునావత్ బాలునాయక్(51) కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. వారం రోజుల క్రితం మెరుగైన చికిత్స నిమిత్తం అతడిని కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలునాయక్ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఇదే తండాకు చెందిన నూనావత్ పద్మ (38) కుటుంబ కలహాలతో వారం రోజుల క్రితం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను నల్లగొండలోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సాయంత్రం 4గంటల సమయంలో మృతిచెందింది.

తల్లిదండ్రులు మందలించారని..

ధన్సింగ్‌తండాకు చెందిన మేగావత్ మారుతికుమార్ (15) దామరచర్ల ఎస్టీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వెళ్లకుండా తిరుగుతుండటంతో తల్లిదండ్రులు మందలించారు. మనస్తాపం చెందిన మారుతికుమార్ గురువారం పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని మిర్యాలగూడ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించి సాయంత్రం 6గంటలకు మృతిచెందాడు. ఇలా ఒకే సామాజికవర్గానికి చెందిన ముగ్గురు వ్యక్తులు గంటల వ్యవధిలోనే మృతిచెందడం తండావాసులను కలచివేసింది. తండాలో నివసిస్తున్న వారంతా ఒకే సామాజికవర్గానికి చెందిన వారు కావడం, అందరికీ బంధుత్వం ఉండడంతో అందరూ దుఃఖసాగరంలో మునిగిపోయారు. శనివారం ఒకరి తర్వాత మరొకరి దహనసంస్కారాలు నిర్వహించారు.